వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 160
శనివారం | 23 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

## రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి



2లో






వివరాలు 2లో..

# సవాల్‌గా ఈ కేవైసీ..?

అది ఉంటేనే గ్యాస్ రాయితీ అంటూ ప్రచారం

గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం పడిగాపులు

ప్రచారం నమ్మొద్దంటున్న నిర్వాహకులు

విధి విధానాలు ఖరారు చేయని ప్రభుత్వం

గ్యాస్ రాయితీ పథకం అమలు విధివిధానాలపై ప్రజల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిబంధనలు పెట్టకపోయినా.. కేవైసీ ఉంటేనే రాయితీ వర్తిస్తుందన్న ప్రచారం జరగడంతో లబ్ధిదారులు ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ కేవైసీ పూర్తి చేయాలని గడువు విధించడంతో గ్యాస్ ఏజెన్సీల ఎదుట జనం బారులు తీరుతున్నారు. అంతేకాదు, మహిళల పేరున ఉంటేనే గ్యాస్ రాయితీ వర్తిస్తుందనే ప్రచారం జోరందుకోవడంతో కొందరు తమ ఖాతాలను మహిళల పేరున మార్చాలంటూ ఏజెన్సీ ప్రతినిధులకు మొర పెట్టుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, వివరాలు అప్డేట్ చేయడానికి ఇంకా సమయం ఉందని చెప్పినా వినడం లేదని వాపోతున్నారు. సర్వర్ సమస్యలు తలెత్తుతున్న తరుణంలో వీరందరి 'నో యువర్ కస్టమర్' వివరాలు నమోదు చేయడం సవాల్‌గా మారిందని పేర్కొంటున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

## కేయూలో ర్యాగింగ్



### 78 మంది విద్యార్థులు సస్పెండ్

వరంగల్ కాకతీయ విశ్వ విద్యాలయంలో ర్యాగింగ్ తీవ్ర కలకలం రేపింది. జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు శుక్రవారం ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ర్యాగింగ్ చేసిన వారిలో అమ్మాయిలు కూడా ఉన్నారు. ఈ ఘటనలో మొత్తం 78మంది విద్యార్థినీ విద్యార్థులను వారం పాటు హాస్టల్స్ నుంచి సస్పెండ్ చేశారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ



2లో..

## వైభవంగా వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం

రంగనాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 23, డిసెంబర్ 2023
www.warangalvoice.net



# సవాల్‌గా ఈ కేవైసీ..!

**అది ఉంటేనే గ్యాస్ రాయితీ అంటూ ప్రచారం**

**గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం పడిగాపులు**

**ప్రచారం నమ్మొద్దంటున్న నిర్వాహకులు**

**విధి విధానాలు ఖరారు చేయని ప్రభుత్వం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వినియోగదారులు సొంతంగానే కేవైసీ అప్డేట్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే, ఇలా చేసేందుకు ప్రయత్నిస్తే సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్లేస్టోర్ లో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్, ఇండేన్ తదితర చమురు సంస్థల ఆండ్రాయిడ్ యాప్ లను డౌన్ లోడ్ చేసుకున్న కొందరు అప్ డేట్ సమయంలో ఎర్రర్ వస్తోందని ఫిర్యాదులు చేస్తున్నారని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారు. సంస్థల అధికారిక వెబ్ సైట్లలోనూ ఇవే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గ్యాస్ డెలివరీ బాయ్‌లకే ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా అప్ డేట్ చేసే సౌకర్యం కల్పించినా.. సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు.

### మహిళల పేరుపై ఖాతా ఉంటేనే...

మహిళల పేరుమీద ఉన్న ఖాతాలకే గ్యాస్ రాయితీ పథకం వర్తిస్తుందన్న ప్రచారంతో పలువురు కష్టమర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఏండ్ల కింద పురుషుల పేరు మీదనే గ్యాస్ కనెక్షన్‌లు ఎక్కువగా ఉండేవి. మహిళా సంఘాలు వచ్చిన తర్వాత అప్పటి నుంచి తీసుకున్న కనెక్షన్ లు మహిళల పేరుతో వచ్చాయి. అయితే మహిళలకే రాయితీ అన్న ప్రచారంతో తమ కనెక్షన్లను భార్య పేరున మార్చుకునేందుకు ఏజెన్సీల వద్దకు భారీ సంఖ్యలో తరలివస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. గ్యాస్ రాయితీ పథకం మధ్యతరగతి కుటుంబాల అందరికీ వర్తింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఈకేవైసీ ఎలా చేసుకోవాలంటే..

ఈకేవైసీ ఎలా చేసుకోవాలని చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీల వద్దకు మస్ట్‌గా వెళ్లాలా..? లేకా ఏదైనా వెబ్ సైట్ ఉందా అని లబ్ధిదారులు ఆరా తీస్తున్నారు. అయితే, కేవైసీ కోసం ఎలాంటి ఆందోళన అవసరం లేదని, దీనికోసం ప్రత్యేక వెబ్ సైట్ ఉందని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారు. ఇందుకోసం https//www.mylpg.in వెబ్ సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వెబ్ సైట్ ఓపెన్ చేస్తే మూడు గ్యాస్ కంపెనీలకు సంబంధించిన వివరాలు వస్తాయి. ఏ కనెక్షన్ వాడుతున్నారో ఆ సంస్థ సిలిండర్ గుర్తును ఎంపిక చేసుకోవాలి. కేవైసీ అప్ డేట్ అయిందా లేదా ముందు పరిశీలించుకోవాలి. తొలుత సైనప్ ద్వారా వివరాలు నింపి రిజిస్టర్ అవ్వాలి. తర్వాత ఓటీపీ, పాస్ వర్డ్ ద్వారా లాగిన్ అయ్యి 'వ్యూ డిటెయిల్స్'ను ఎంపిక చేస్తే ఖాతాదారుడి పూర్తి వివరాలు వస్తాయి. అందులో కేవైసీ అప్ డేట్ చేశారా.. లేదా అన్న విషయం కనిపిస్తుందని కేవైసీ అప్ డేట్ లేకపోతే లాగిన్ అయ్యాక 'నీడ్ కేవైసీ' ఎంపిక చేసుకోవాలి. తర్వాత కనిపించే దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేసి ఏజెన్సీలో ఇస్తే బయో మెట్రిక్ ద్వారా ప్రక్రియను పూర్తి అవుతుంది.

# పీవీని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉంది

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దివంగత ప్రధాని పీవీ నరసింహారావును గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని రాష్ట్ర బీసీ రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో శనివారం పీవీ 19వ వర్ధంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలనలో జిల్లాల పునర్విభజన జరిగే సందర్భంలో చరిత్రకారులకు, తెలంగాణ పోరాట యోధులకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి సలహాలతో మహానుభావుడు పీవీ నరసింహారావు పేరుతో జిల్లా ఏర్పాటు డిమాండ్ మేధావుల వాదనపై చర్చలు జరుపుతామని పీవీ జిల్లా సాధన సమితి సభ్యులతో అన్నారు. మెదక్ నుంచి ఎల్కతుర్తికి నిర్మాణం జరుగుతున్న హైవేకు పీవీ పేరును పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. పీవీ శతజయంతి ఉత్సవాల్లో ప్రకటించిన విధంగా గత ప్రభుత్వంలో రూ.11 కోట్లతో నిర్మితమవుతున్న పీవీ స్మృతి వనానికి సంబంధించి మిగిలిన పనులపై ఒక నివేదిక ఏర్పాటు చేసి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పటిష్ట పరచడానికి నవోదయ,గురుకులాలు 45వరకు ఏర్పాటు చేసిన ఘనత పీవీదే అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి వేల కోట్ల



రూపాయలు కేటాయించారని అన్నారు. భూస్వామి అయినప్పటికీ నిరుపేదలకు భూమి పంచడానికి భూసంస్కరణలు తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దేశం గర్వించదగ్గ మహనీయుని సేవలను నిరంతరం ఇప్పటి తరానికి పాఠ్యపుస్తకాలల్లో, దృశ్యరూపాల్లో చరిత్రను సజీవంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ముగిసింది. శీతాకాల విడిది నిమిత్తం ఈ నెల18న రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి, పలు కార్య క్రమాల్లో పాల్గొన్నారు. భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. నిన్న రాత్రి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం హకీం పేట్‌లో రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో ఆమె ఢిల్లీ బయల్దేరారు.



# వైభవంగా వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం

**రంగనాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు**

**ఆలయాలకు పోటెత్తిన భక్తులు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గలోని అతి పురాతన రంగనాథ స్వామి దేవాలయంలో శనివారం రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల 45 నిమిషాలకు ఉత్తర వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగ సేవా సంస్థ అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్ దంపతులు, రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి దంపతులు, 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ దంపతులు, ఆలయ ప్రధాన కార్యదర్శి చిలుపూర్ సురేష్ దంపతులు, ప్రముఖ ఆడిటర్ గోసికొండ సుధాకర్ దంపతులు, గుత్తికొండ నవీన్ దంపతులు, కందగట్ల రాజు దంపతులు, ఆడెపు వైకుంఠం, దుస్స సుదర్శన్, దుస్స అశోక్ దంపతులు, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, విక్కి భాస్కర్, కమిటీ సభ్యులు వీరాటి ప్రకాష్ రెడ్డి, గుండా చంద్రమౌళి, వంగరి సమ్మయ్య, మౌటం శ్రీనివాస్, రాగుల ప్రసాద్, పిట్టల కోటి, కూరపాటి రవికుమార్, మంచాల శ్రీనివాస్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షురాలు కూరపాటి రోజా, మంచాల సృజన, కోలా కవిత, శ్రీరాముల పుష్పలీల, తదితర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన ఎయిడెడ్ జాక్ ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎయిడెడ్ టీచర్స్ జాక్ ప్రతినిధులు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలు ప్రతి నెల వేతనాలు ఆలస్యంగా రావడం,హెల్త్ కార్డు లేకపోవడం, ప్రమోషన్లు లేకపోవడం లాంటి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయులు విద్యా రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉండేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాక్ కన్వీనర్ తన్వీర్, కో కన్వీనర్లు పూజారి మనోజ్ కుమార్ గౌడ్, జటబోయిన స్వామి, అట్లూరి శ్రీధర్, బెల్లంకొండ పూర్ణచందర్, పాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్టుగుట్టలో ఎమ్మెల్యే నాగరాజు పూజలు



**వరంగల్ వాయిస్, మడికొండ :** హనుమకొండ జిల్లాలోని మడికొండ శ్రీ మెట్టుగుట్ట రామ లింగేశ్వర స్వామి సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, ఆలయ ఈవో శేష భారతి, ఆలయ చైర్మన్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ఉంటా..

### సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కామిడీ రత్నాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలం జడల్ పేట గ్రామానికి చెందిన సర్పంచ్ కామిడీ రత్నాకర్ రెడ్డి ప్రజలకు అండగా..అభివృద్ధికి ఆలవాలంగా ఉంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ మనోగతాన్ని పంచుకున్నారు. తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించినప్పుడు మండలం నుంచి కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంతో 2018లో ఆ పార్టీలో చేరారు. ఈ క్రమంలో వచ్చిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో జడల్ పేట సర్పంచిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం చిట్యాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఉన్న ఆయన గండ్ర సత్యనారాయణ రావుతో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి గండ్ర సత్యనారాయణ రావు గెలుపు కోసం మండలంలో సుడిగాలి పర్యటన చేసి, కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో గండ్ర సత్యనారాయణ రావు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన కృషిని పార్టీ అధిష్టానం గుర్తించింది. కాగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అండతో గ్రామంలో కనీస వసతుల కల్పనకు కృషి చేస్తానని రత్నాకర్ రెడ్డి చెప్పారు.

# వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలోని ప్రతి వినియోగదారు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జీఎస్టీ ఛార్జీల పేరుతో అదనంగా చెల్లించాలని ఎవరైనా అడిగినట్లయితే వారిపై జిల్లా అధికారులకి తెలియజేయాలన్నారు. వినియోగదారులను ఇబ్బందులు పెడితే చర్యలు చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా డిజిటల్ వినియోగం, డిజిటల్ చెల్లింపుల విషయంలో తమ ఖాతా , డెబిట్, క్రెడిట్ కార్డ్ వివరాలు, ఓటీపిలు వేరే వాళ్ళకి చెప్పే ముందు చాలా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు , కేవలం విశ్వసనీయత కలిగిన ఈ-కామర్స్ ప్లాట్ ఫాం నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ తో చర్చించిన అనంతరం కన్స్యూమర్ సెల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ-కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ అనే అంశం గురించి జిల్లా పౌరసరఫరాల అధికారి పి.వసంత లక్ష్మి వివరించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ-కామర్స్, డిజిటల్ వర్తకశకంలో వినియోగదారుల రక్షణకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఎం.హరిప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మహేందర్, తహసిల్దార్ డీఏవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసిల్దార్లు రమేష్, కృష్ణ, సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వేణు, బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సీనియర్ అసిస్టెంట్ ఎండీ.ఆజాద్ అహ్మద్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు రతన్ సింగ్ ఠాకూర్, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మైనారిటీల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తా



**వరంగల్ వాయిస్, పరకాల :** క్రిస్టియన్ మైనారిటీల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం గీసుగొండ మండలం కొమ్మాల దస్రు తండాలోని బాప్టిస్ట్ చర్చిలో నిరుపేద క్రిస్టియన్ మైనారిటీలకు క్రిస్మస్ కానుకలు, దుస్తులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. మొదటిసారిగా చర్చికి వచ్చిన ఎమ్మెల్యేకు ఫాస్టర్లు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రార్థనలు చేసి దేవుని దీవెనలు అందించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారని, అందుకే వివిధ శాఖల వారీగా సమీక్ష చేస్తున్నారని అన్నారు. అప్పుల కుప్పగా చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేసేందుకు ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 70 వేల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేడు సుమారు రూ. 7లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా తెలంగాణను చేశారని మండిపడ్డారు. పుట్టిన బిడ్డకు సుమారు రెండు లక్షల అప్పు వేసిన ఘనత కేసీఆర్ కుటుంబానికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు అనేక ఆలోచన చేస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా వంద రోజులలోగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని, మీరు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచినందుకు, కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మీ ప్రతీ కోరికను నెరవేరుస్తామని రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు.

## పీవీ నరసింహారావు గొప్ప సంస్కరణ శీలి



**వరంగల్ వాయిస్, పరకాల :** భారత మాజీ ప్రధానమంత్రి, తెలంగాణ ముద్దు బిడ్డ, బహుబాషా కోవిదుడు స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకొని పరకాల మాజీ శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం, బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10:00 గంటలకు పరకాల పట్టణంలోని స్థానిక అమరధామంలో ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు డాక్టర్.మడికొండ శ్రీను పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మడికొండ శ్రీను మాట్లాడుతూ నిరంతర సంస్కరణ శీలిగా భారత దేశ చరిత్రలో పీవీ నరసింహా రావు చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఆర్థిక, విద్య, భూపరిపాలన తదితర రంగాలలో పీవీ నరసింహా రావు ప్రవేశపెట్టిన, అమలు చేసిన సంస్కరణల ఫలితాన్ని నేడు భారతదేశం అనుభవి స్తున్నదని అభిప్రాయపడ్డారు. దేశం గర్వించదగ్గ వ్యక్తి పీవీ నరసింహారావు అని, కేంద్ర ప్రభుత్వం తెలుగువారిని పట్టించుకోవడం లేదన్నారు. తెలుగువారంటే కేంద్రంలో గౌరవం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుతవం హయాంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా పీవీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మునిసిపల్ కౌన్సిలర్లు బండి రాణి సదానందం గౌడ్, మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్, ఏకు రాజు, బీఆర్ఎస్ నాయకులు బండి వెంకటేష్, ఎండీ అల్తాఫ్, రత్న శేలేందర్, ఏరుకొండ అవినాష్ గౌడ్, గుంటి రాజేందర్, బొజ్జం సాయి, కటంగూరి విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హైదరాబాద్ నుంచిరాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష్ జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ క్రిస్టినా జెడ్ చూంగ్తు, మిషన్ డైరెక్టర్ ఎన్ హెచ్ఎం ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ జిల్లాలో గవర్నమెంట్ హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్ లో కోవిడ్ సంబంధించిన ప్రత్యేకమైన వార్డు ఏర్పాటు చేయాలని, ఎమర్జెన్సీ మెడిసిన్స్, ఆక్సిజన్ సిలిండర్స్, ఆర్టి పీసీఆర్ టెస్ట్ కు సంబంధించిన ర్యాపిడ్ టెస్ట్ కు సంబంధించిన కిట్స్ అన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా కరోనా లక్షణాలు, సాధారణ జ్వరం, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులు, దగ్గు, గొంతులో నొప్పి లక్షణాలుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, జిల్లాలో ఉన్న వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బంది, ఆశాలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్య విధాన పరిషత్ సూపరిండెంట్ డాక్టర్ వెంకట రాములు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డీపీఓ రుక్మొద్దీన్, డీడీఎం సామిత్, కేవీ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అధికారులందరూ పాల్గొన్నారు.

# అర్హులైన పేద వారికి సంక్షేమ పథకాలు

## క్రిస్మస్ కానుకలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 53వ డివిజన్ లష్కర్ సింగారంలోని బెతేల్ బాప్టిస్ట్ చర్చిలో బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రిస్టియన్ సోదరీ, సోదర మణులకు క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, క్రిస్టియన్లకు ముందస్తుగా నాయిని రాజేందర్ రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రిస్మస్ సందర్భంగా పేదలకు క్రిస్మస్ కానుకలు పంపిణి చేయాలని ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగా శనివారం నేను లష్కర్ సింగారంలోని బెతేల్ బాప్టిస్ట చర్చిలో క్రిస్మస్ కానుకలు పంపిణి చేయడం చాలా అనందకరంగా ఉందన్నారు. నేను ఎప్పుడు ఈ ఏరియాకి వచ్చినా, చర్చికి వచ్చిన ఇక్కడ ప్రజలు నన్ను చాలా ఆదరించారని గుర్తు చేశారు. దేవుడి కృప వలన ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరు ఎంతో పవిత్రంగా భావించే క్రిస్మస్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని, ఆ ఏసుక్రీస్తు దీవెనలు ఎల్లపుడు మనతో ఉండాలన్నారు. మీ ఇంట ఆనందాలు నిండాలని కోరుకుంటూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద వారికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాబా భాయి, కార్పొరేటర్ గా పోటీ చేసిన అభ్యర్థి ఎర్ర కావ్య, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్ర మహేందర్, మాజీ కార్పొరేటర్ కూర సురేందర్, బెతేల్ బాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్ వై.అబ్రహం, చేపూరి శ్యాం, ఎర్ర చందు, ఎర్ర ప్రనయ్, కే.రాజేష్, దామెర శంకర్, ఎర్ర అబ్రహం, మైనారిటీ డిపార్టుమెంట్ ఈడీ శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ బహుమతుల అందజేత




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎల్బీ నగర్ లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన క్రిస్టమస్ వేడుకల్లో శనివారం రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొని క్రిస్టియన్ సోదరులకు క్రిస్టమస్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, కార్పొరేటర్లు, పాస్టర్స్ ఉన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను లబ్ధిదారులకు పెళ్లికి ముందే అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికను రూపొందిస్తున్నదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. శనివారం గీసుకొండ మండలంలోని కొనయమాకుల రైతు వేదికలో గీసుకొండ మండల పరిధిలోని 73 మంది లబ్ధిదారులకు రూ.73,01,168 చెక్కులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, సంవత్సరం కాలం పట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని 100రోజులలో నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు.

## క్రిస్మస్ దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండల పరిధిలోని పున్నెల్ గ్రామం లోని మిషన్ ఇండియా క్యాంప్ కార్యాలయంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా శనివారం వర్ధన్నపేట శాసనసభ్యుడు విశ్రాంత ఐపీఎస్ అధికారి కే ఆర్ నాగరాజు ముఖ్య అతిధిగా హాజరై క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ విందు, దుస్తులను పంపిణీ పంపిణీ చేశారు. అనంతరం ఐనవోలు పాస్టర్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తదనతరం ఎమ్మెల్యేను మండల పాస్టర్స్ కమిటీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు పాస్టర్స్ ఫెల్లోషిప్ కమిటీ భ్యులు, మండల ఎమ్మార్వో, అధికారులు, మండల నాయకులు,ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ లు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీ వెంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వార దర్శనం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాలలో శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులకు ఉత్తర ద్వారం గుండ స్వామి వారి దర్శనం కల్పించారు. ఉదయం 5గంటలకు ఆలయ అర్చకులు మార్త రాజకుమార్ వేదమంత్రోచ్చారణల మధ్య గోదా రంగనాయకుల స్వామి పూజ, తిరుప్పావై పారాయణం, అష్టోత్తర పుష్పాల పూజ, మంగళహారతి, ఉత్తర ద్వారం దర్శనం, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ మచ్చ గిరి స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా వచ్చిన భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్య ప్రకాష్, సామల భిక్షపతి భక్తులు పాల్గొన్నారు.

## మంచాల రమాదేవికి పరామర్శ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి ఇటీవల జాతీయ మహాసభలకు బయలుదేరిన సందర్భంలో బైక్ ప్రమాదానికి గురై కాలు విరిగి అనారోగ్యంతో స్వగ్రామమైన భీమ దేవరపల్లి మండలం వంగరలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మంచాల రమాదేవిని శనివారం భారత జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, నేదునూరి రాజమౌళి, దొంతు రాధిక, బంటు కనకం, మీద విజయ పరామర్శించారు. రమాదేవి త్వరగా కోలుకొని దినచర్యను కొనసాగించుకోవాలని వారు ఆకాంక్షించారు.

## ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొమ్మ కంటి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, కాంగ్రెస్ నాయకులు ఇనగాల రమేష్, మడికొండ సంపత్ పెయింటర్, మడికొండ చెంగల్ రావు, ధావు పరమేశ్వర్, ఏకు రవికుమార్, ఉడుత సంపత్, బోచ్చు మోహన్, దొమ్మటి నాని, బొచ్చు అనంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ వ్యవసాయంతో ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రైతు ఉత్పత్తిదారుల సంస్థ – మాటేడు ఆధ్వర్యంలో రైతు దినోత్సవం వేడుకలు సంస్థ చైర్మన్ మంగళపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గానిక్ వ్యవసాయంపై వివరించారు. దీనివల్ల కలిగే లాభాలను చెప్పారు. ఆరోగ్యరీత్యా ఎక్కువగా మనకు అనేక ఉపయోగాలు ఉన్నాయని, ఆర్గానిక్ ఫామింగ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం సంస్థ డైరెక్టర్ కుంభం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి పది మంది రైతులు మొదటగా పండించే విధంగా వారికి ఎలా చేయాలో వివరించాలని చెప్పారు. సంస్థలోని డైరెక్టర్లు కూడా వీరన్న, దీకొండ వెంకన్న, పందుల వెంకట సోములు, భూక్య నరేష్ అన్నిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మంగళపల్లి సోమయ్య, భగవాన్ సింగ్ లు కలిసి ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి రైతులకు వివరించారు. సంస్థలో ఉన్న రైతులు, తొర్రూరు, మాటేడు, పత్తేపురం, పోలపల్లి గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అడ్డే లేని బెల్టు షాపుల దందా..!

### బార్లుగా వైన్ షాపుల సిట్టింగ్ రూములు

**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మండలంలోని గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. అడ్డే లేని బెల్ట్ షాపుల దందా 3 బీర్లు 6 ఫుల్ బాటిల్ లు అన్న చందంగా నిర్వహిస్తున్నారు. మండలానికి రెండు మద్యం షాపులకు లైసెన్స్ రాగా ఒకటి సిండికేట్ కాగా దాని నుంచి వివిధ గ్రామాలకు మద్యం సరఫరా చేస్తారు. మరొకటి రిటైల్ షాప్ ఇక్కడి పరిమిట్ రూమ్ లో సిట్టింగ్ సిస్టం బార్ ను తలపింప చేస్తుంది. అందులో టాయిలెట్ సౌకర్యం కూడా ఉండదు. ఎవరికైనా ఒకటికి వస్తే అందులోనే పక్కన ఉన్న గోడ ఆసరాగా విసర్జించాల్సి వస్తుంది. దాంతో శుభ్రత లేని ఆ రూమ్ లో దుర్వాసన వెదజల్లుతోందని మద్యపాన ప్రియులు ఆరోపిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం కనీస వసతుల కల్పన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## క్రిస్మస్‌కు సిద్ధమైన చర్చిలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ మండల కేంద్రంలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సీఎస్ఐ ఏఫిఫని చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైయింది. చర్చి ప్రాంగణంలో శాంతా క్లాస్, క్రిస్మస్ ట్రీ, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతుల్లో చర్చి వెలుగులుతీనుతోంది. చర్చిలో ప్రత్యేక ఆరాధనలకు తరలివచ్చే భక్తులకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తెల్లవారుజామున 4:30 గంటలకు మొదటి ఆరాధనను బిషప్ కోడిరెక్కల పద్మారావు ప్రారంభిస్తారు. అత్యంత ఘనంగా జరిగే వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఇంగ్లాండ్ దేశస్థులు కూడా విచ్చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

## బాలికను ఆశీర్వదించిన శంకర్ నాయక్



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నోముల వెంకన్నకుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్-డా.సీతామహాలక్ష్మి దంపతులు హాజరై బాలికను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ యాదవ్, యాసం రమేష్, సర్పంచ్ యకయ్య, బొల్లు మురళి, నరేందర్, లింగమూర్తి, నజీం, మహేష్, తదితరులు ఉన్నారు.

## జైల్లో 18ఏళ్ల లోపు పిల్లలను ఉంచరాదు

### జువైనల్ బోర్డు సభ్యులు వెల్లడి



**వరంగల్ వాయిస్, జనగాం :** సబ్ జైల్‌లో 18 సంవత్సరాల లోపు పిల్లలను బాల నేరస్థులను ఉంచకూడదని ఎవరైనా అలాంటి వారు ఉంటే వెంటనే వారిని జువైనల్ హోంకు తరలించాలని జువైనల్ బోర్డు సభ్యులు అన్నారు. శనివారం జనగాం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఉమ్మడి వరంగల్ జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు మెరుగు సుభాష్, డా.కె.గోపిక రాణిలు సబ్ జైల్ పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. జైల్ సిబ్బంది, ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ బ్యారక్లను పరిశీలించి నిరుపేద ఖైదీలకు లీగల్ ఎయిడ్ కోసం సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొఫెషన్ అధికారి యం.రాజు, జనగాం జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ యం.రవీందర్, అసిస్టెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీకాంత్, జైల్ సూపరింటెండెంట్ కృష్ణ కాంత్, జైలు సిబ్బంది ఉన్నారు.

## ధర్మన్న సాదుల్‌కు రాపోలు నివాళి



**వరంగల్ వాయిస్, మహారాష్ట్ర :** సోలాపూర్ మాజీ ఎంపీ ధర్మన్న సాదుల్ ఏకాదశ శ్రద్ధ కార్యక్రమానికి రాపోలు ఆనంద భాస్కర్ హాజరై ధర్మన్న చిత్రపటానికి నివాళులర్పించి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాపోలు మాట్లాడుతూ ధర్మన్న నాకు అత్యంత సన్నిహితుడు, సోలాపూర్ కు వెళ్ళినప్పుడు ప్రతిసారి ధర్మన్న తన ఇంట్లోనే ఆశ్రయాన్ని ఇచ్చేవారని గుర్తు చేసుకున్నారు. ధర్మన్న రెండు సార్లు ఎంపీగా సేవలు అందించారని, కరీంనగర్ మూలాలు కలిగిన ఆయన సోలాపూర్ లో తనకంటూ ఒక చరిత్రను సృష్టించుకున్నారన్నారు. అక్కడి సామాజిక, రాజకీయ సమస్యల పట్ల పోరాటం చేసి విజయాలు సాధించారని కొనియాడారు. తెలంగాణ నుంచి వలస వెళ్లిన చేనేత కార్మికులతో పాటు, స్థానిక కార్మికులకు అండగా నిలిచారని తెలిపారు. ఎంత ఎత్తుకు ఎదిగినా కూడా, అత్యంత నిరాడంబరంగా గడిపిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు.

# క్రీస్తు బోధనలు మనమందరం పాటించాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మానవాళి క్రీస్తు బోధనలైన శాంతి , ప్రేమ మార్గాలను పాటిస్తూ ప్రశాంతంగా జీవనం సాగించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరు నగర్ లోని కల్వరి చర్చిలో నిర్వహించిన భూపాలపల్లి నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రైస్తవులకు లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గిఫ్ట్ ప్యాక్ లను పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్లతో, క్రైస్తవ మతస్తులతో కలిసి విందు భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో మూడో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం తనకు సంతోషంగా ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, ప్రపంచంలోనే మానవాళికి ఏసుక్రీస్తు ప్రేమ సత్యం శాంతి అని మార్గాలను బోధించారని, వాటిని మనం నిరంతరం పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని పేదలైన క్రైస్తవులకు ప్రభుత్వం తరఫున గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. క్రైస్తవ ప్రార్థన స్థలాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. క్రైస్తవ శ్మశాన వాటిక కోసం అవసరమైన మేర భూ కేటాయింపు ప్రక్రియ చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మాతాలను సమానంగా గౌరవిస్తూ క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రతి నియోజక వర్గానికి 2లక్షల రూపాయలు, వెయ్యి గిఫ్ట్ ప్యాక్ లను కేటాయించడం జరిగిందని భూపాలపల్లి నియోజక వర్గంలో అదనంగా మరో వెయ్యి గిఫ్ట్ ప్యాక్ లను అందిస్తామని అన్నారు. మతాల పేరిట, కులాల పేరిట ప్రజలను విడగొడుతూ రెచ్చగొట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భూపాలపల్లిలోని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదిస్తే తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయాన్ని గుర్తు చేస్తూ రాబోయే ఐదు సంవత్సరాల పాటు 24గంటలు ప్రజాసేవలో నిజాయితీగా పని చేస్తానని, ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి మాట, ఇచ్చిన ప్రతి హామీ ఏసు ఆశీస్సులతో నెరవేరుస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పాస్టర్లు, క్రైస్తవ మతస్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** భారతమాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతి సందర్భంగా శనివారం హసన్ పర్తి వేంకటెశ్వర కాలనీలో గల పీవీ కాంస్య విగ్రహానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలిస్ కాజీపేట డేవిడ్ రాజ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజ్ మాట్లాడుతూ 1991-96 వరకు భారత ప్రధానిగా మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదు సంవత్సరాలు తన చాణక్య నీతితో పాలించడమే కాక గడ్డుప రిస్థితిలో ఉన్న దేశ ఆర్థికస్థితిని తన సరళీకృత విధానాలతో మెరుగుపరిచి ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ప్రపంచదేశాలచే కీర్తింపబడిన వ్యక్తి పీవీ అని కొనియాడారు. అనంతరం మోత్కూరు మనోహర్ రావు మాట్లాడుతూ పీవీ సంస్కరణాభిలాషి అని, తను చేపట్టిన ప్రతి పదవికి వన్నెతెచ్చి ఎన్నో నూతన సంస్కరణలను అమలు చేశాడన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రిగా భూసంస్కరణలు, దేశ ప్రధానిగా ఆర్థిక సంస్కరణల ద్వారా శాశ్వత కీర్తి పొందాడన్నారు. పీవీ జీవితచరిత్ర ప్రతివిద్యార్థి చదవి ఆదర్శంగా జీవించాలని సభకు హాజరైన లిటిల్ సోల్జర్స్ స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ మేనకోడలు ఇందిర మనోహర్ రావు, వెంకట్, జయ ప్రసాదరావు, శ్రీనివాసరావు, రవీందర్ రావు, ప్రతాప్ రెడ్డి, మల్లయ్య, దామెర ఎంపీపీ శంకర్ తదితరులు పాల్గొని పీవీకి ఘనంగా నివాళు లర్పించారు.

# సర్వ మతాల సారం ఒక్కటే

### విప్, ఎమ్మెల్యే రామచందర్ నాయక్

### క్రిస్టియన్లకు దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** సర్వ మతాల సారం ఒక్కటే నని ప్రేమ, కరుణ, జాలీ ఇవి మాత్రమే మానవ మనుగడకు మూలాలు, కోపం మనిషికి శత్రువు లాంటిదని, ప్రేమతో దానిని జయించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భార్గవ ఫంక్షన్ హాలులో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో, డోర్నకల్ నియోజకవర్గంలో మార్పు రావాలని కాంగ్రెస్ ను గెలిపించారన్నారు. ఈ సారి ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన మత పెద్దలకు, ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్మస్ కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పేద క్రిస్టియన్లకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ప్రముఖ వ్యాపార వేత్త వుప్పల జాషువా వెంకటేశ్వర్లు, పాస్టర్ రామాచారి, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..**

మరిపెడ పట్టణంలోని భార్గవ ఫంక్షన్ హాల్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ లబ్ధిదారులకు మొత్తం 56చెక్కులను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దన్సింగ్ నాయక్, డీటీ నంద, మున్సిపల్ కమిషనర్ బీఏ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగంధర్ రెడ్డి, గంధసిరి అంబరీష, కాలం రవీందర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ షేక్ తాజుద్దీన్, టౌన్ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అజీజ్, జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎండీ అఫ్సర్, పట్టణ నాయకులు కారంపూడి ఉపేందర్, గంధసిరి కృష్ణమూర్తి, బోర గంగయ్య, వెర్మరెడ్డి వెంకట్ రెడ్డి, ముదిరెడ్డి లక్ష్మారెడ్డి, పద్మశాలి నాయకులు దేవరశెట్టి కృష్ణమూర్తి, దేవరశెట్టి వెంకన్న, కోమటి వీరన్న, దేవరశెట్టి నిర్మల్ రాజ్, గంధసిరి లక్ష్మయ్య, గంధసిరి వీరభద్రం, జాటోత్ సురేష్, వెంకట్ సాయి, దస్రు నాయకులు పాల్గొన్నారు.







# శబరీశ్వర నమోస్తుతే..

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ
## శరణుఘోషతో మార్మోగిన ప్రాంగణం
## అభిషేకాలు, భజనలతో అలరించిన భక్తులు

కొలిచిన వారికి కొంగు బంగారంగా మారే అయప్ప స్వామి వారి మహా పడిపూజ హనుమకొండ నగరంలోని కేయూ పెగడపల్లి డబ్బాల క్రాస్ వద్ద గల హనుమాన్ నగర్ లో ఘనంగా జరిగింది. భారీగా అయ్యప్ప మాలధారులు తరలివచ్చి శబరీశ్వరుడికి పూజలు చేశారు. సంతోష్, మహేష్, సంతోష్ కుమారుడు కన్యస్వామి ఈ మహా పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన అయప్పలు స్వామి వారిని కీర్తిస్తూ పాటలు, భజనలు, పూజలు చేశారు.

### కన్నులపండుగగా అభిషేకం..

అభిషేకం చేయడానికి అదృష్టం ఉండాలి.. అభిషేకం చూడడానికి పుణ్యం చేసుకోవాలి.. అలాంటి అయ్యప్ప స్వామి అభిషేకం ఈ మహా పడిపూజ సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. పంచామృతాలు, వివిధ రకాల పండ్లు, కుంకుమ, భస్మం, గంధం, పసుపు, తేనే, పూలు, పన్నీరు, కొబ్బరినీరు పలు రకాలుగా మణికంఠుడిని అభిషేకించి అయ్యప్ప మాల ధారులు తరించారు. ముఖ్యంగా అభిషేకం సమయంలో ఆలపించిన పాటలు ఆహుతులను అరించాయి. అనంతరం పూజల చేసిన 18 కలశాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. తర్వాత స్వామివారిని పూలతో అభిషేకించి అందంగా అలంకరించారు. మహా నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించారు.

### అన్నదానం..

మహా పడిపూజ కార్యక్రమానికి విచ్చేసిన అయప్ప మాలధారులకు సంతోష్, మహేష్ స్వాములు మహా అన్నదానం చేశారు. పలు రకాల వంటలతో వండిన భోజనాన్ని వండించి అయ్యప్ప మాలధారులను సంతృప్తి పరిచారు. అన్నదానం అనంతరం స్వాములకు పాదాభివందనం చేసి వారు స్వాముల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు, పెద్దలు భారీగా పాల్గొన్నారు.



























# 'సౌండ్ ఆఫ్ సలార్'



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'సలార్. దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమాకు అంతటా పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో భారీ ఓపెనింగ్స్ రాబడుతున్నది. అయితే ప్రశాంత్‌నీల్ సినిమాలలో పాటల కంటే బీజీఎం(బ్యాక్ గ్రౌండ్ స్కోర్)కే ఎక్కువ క్రేజ్ ఉంటుదన్న విషయం తెలిసిందే. కేజీఎఫ్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించడానికి కూడా ముఖ్య కారణం బీజీఎం. రాఖీ ఎలివేషన్ అప్పుడు అయిన, గరుడ ఎంట్రీ సీన్ అయిన సినిమాను నడిపించింది బీజీఎం అని చెప్పకతప్పదు. ఇదిలావుంటే.. లేటెస్ట్‌గా వచ్చిన సలార్‌లో కూడా బీజీఎం ప్రధాన బలంగా పనిచేసింది. ముఖ్యంగా ప్రభాస్ ఎంట్రీ బీజీఎం గూస్ బంప్స్ తెప్పిచింది. ఇక ఈ సినిమాకు ప్రధాన బలమైన బీజీఎంను తాజాగా చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. 'సౌండ్ ఆఫ్ సలార్' పేరుతో ఈ వీడియోను విడుదల చేయగా.. రవి బస్రూర్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ అద్భుతమైన సౌండ్ ట్రాక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## డియర్ దేవా..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం సలార్ భారీ అంచనాల నడుమ శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు అంతటా పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో భారీ ఓపెనింగ్స్ రాబడుతున్నది. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు సైతం ఈ సినిమా చూసేందుకు బారులుతీరున్నారు. అయితే ఈ సినిమా చూసిన మెగాస్టార్ చిరంజీవి సలార్‌పై ప్రశంసలు కురిపించాడు. డియర్ దేవా (ప్రభాస్)కి ముందుగా శుభాకాంక్షలు తెలుపుతున్నాను. సలార్ సీజ్ ఫైర్ బాక్సాఫీస్ వద్ద అదరగొడుతుంది. అద్భుతమైన సినిమాను తెరకెక్కించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ కు కుడోస్. పృథ్వీరాజ్ సుకుమారన్, శృతి హాసన్, జగపతి బాబు ఈ సినిమాలో అద్భుతంగా నటించారు. మిగతా టెక్నీకల్ టీం అంతా సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ప్రతి ఒక్కరికీ అభినందనలు అంటూ చిరు ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. ఇక ఈ మూవీకి చిరు రివ్యూ ఇవ్వడంతో ప్రభాస్ ఫ్యాన్స్ సంతోషంలో మునిగిపోతున్నారు.

## మొదటిరోజు కలెక్షన్స్ టాప్

'సలార్' మొదటి రోజు కలెక్షన్ల విషయానికి వస్తే, ప్రభాస్ బాక్స్ ఆఫీస్ దగ్గర తన సత్తా మరోసారి చూపించాడు అని అర్థం అవుతోంది. నైజాం కింగ్ ఎవరంటే ప్రభాస్ అని టక్కున చెప్పేస్తారు, ఆలా వున్నాయి 'సలార్' మొదటి రోజు కలెక్షన్స్. నైజాం ఏరియాలో మొదటి రోజు సలార్ రూ.22.55 కోట్ల షేర్ కలెక్టు చేసి అల్ టైమ్ రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో 'ఆర్ఆర్ఆర్' రూ.23.35 కోట్ల షేర్ తో అగ్రస్థానంలో వుంది. అయితే 'ఆర్ఆర్ఆర్' మల్టీ స్టారర్ సినిమా అందులో రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరు కథానాయకులు, రాజమౌళి దర్శకుడు. ఈ 'సలార్' సినిమా మొత్తం ప్రభాస్ పవర్ మీదే నడిచింది, రెండో స్థానంలో నిలిచింది, ప్రభాస్ సత్తా ఏంటో తెలిసింది. ఇక రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ఈ సినిమా సుమారు రూ.40 కోట్ల షేర్ కలెక్టు చేసినట్టుగా ట్రేడ్ అనలిస్ట్లు చెపుతున్నారు. అలాగే ప్రపంచం మొత్తం మీద ఈ సినిమా సుమారు రూ.95 కోట్ల షేర్ కలెక్టు చేసి నెంబర్ వన్ సినిమాగా నిలిచిందని చెపుతున్నారు. గ్రాస్ పరంగా చూసుకుంటే ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.180 కోట్లు కలెక్టు చేసిందని అంటున్నారు.

# ఏషియన్ వీక్లీ జాబితాలో 25వ స్థానంలో ఎన్టీఆర్



'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్‌స్టార్‌గా అవతరించిన అగ్రహీరో ఎన్టీఆర్ మరో ఘనతను కూడా సొంతం చేసుకున్నాడు. ఆసియాలో 2023 టాప్ 50లో నిలిచిన నటుల జాబితాను 'ఏషియన్ వీక్లీ' ప్రకటించింది. అందులో 25వ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో షారుక్‌ఖాన్ ప్రథమ స్థానంలో నిలవగా, పలువురు బాలీవుడ్ నటులు కూడా ఇందులో చోటు దక్కించుకున్నారు. అయితే, తెలుగు సినిమా నుంచి ఈ జాబితాలో స్థానం సంపాదించుకున్న ఏకైక నటుడు ఎన్టీఆర్ మాత్రమే. 'ఈస్టర్న్ ఐ 2023' పేరిట ఈ జాబితాను విడుదల చేశారు. దీనితోపాటుగా అమెరికన్ మ్యాగజైన్ 'వెరైటీ' ఇటీవల ప్రకటించిన 500మంది అత్యంత ప్రతిభాశీలుర జాబితాలో తారక్, రాజమౌళీలకు చోటు దక్కడం విశేషం. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం తారక్ 'దేవర' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకునిగా నటిస్తున్నారు. కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజ్‌లో తొలిభాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.




# ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై చెర్రీ దంపతులు

టాలీవుడ్ మెగా హీరో రామ్ చరణ్ దంపతులు మరో అరుదైన ఘనత సాధించారు. తాజాగా వీరిద్దరూ ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్ పేజీపై దర్శనమిచ్చారు. అయితే ఇప్పటివరకు ఏ టాలీవుడ్ జంట ఇలా ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్ పేజీపై కనిపించలేదు. మొదటిసారి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు రామ్ చరణ్ దంపతులు. దీంతో మెగా ఫ్యాన్స్ సంతోషంలో మునిగిపోతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్? మీడియాలో వైరల్‌గా మారాయి. ఫోర్బ్స్ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో భాగంగా ఈ ఫొటో షూట్ జరుగగా.. సూపర్ కపుల్ అంటూ కవర్ పేజీపై క్యాప్షన్ ఇచ్చారు. ఈ ఫొటోలో పింక్ కలర్ డిజైనర్ డ్రెసుల్లో చరణ్, ఉపాసన ఎంతో అందంగా కనిపిస్తున్నారు. రామ్ చరణ్. ఉపాసనల లవ్ స్టోరీ, వైవాహిక జీవితంలో ఒకరినొకరు ఎలా సపోర్ట్ చేసుకుంటున్నారు. క్లీంకార వారి జీవితంలోకి వచ్చాక ఎలాంటి మార్పులు వచ్చాయి అనేది ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు ఈ మెగా జంట.

# సేంద్రీయ వ్యవసాయ రైతులుగా పేరొందాలి

## జిల్లా కలెక్టర్ శశాంక



వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : ఆరుగాలం కష్టించే రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భూసారాన్ని పరిరక్షించే సేంద్రీయ వ్యవసాయ రైతులుగా పేరొందాలని జిల్లా కలెక్టర్ శశాంక కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్ లో రైతు సహాయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దినోత్సవంలో జిల్లా కలెక్టర్ శశాంక పాల్గొని ప్రసంగించారు. రైతులు దీర్ఘ కాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భూసారాన్ని పరిరక్షిస్తూ సేంద్రియ వ్యవసాయంతో స్థిరాదాయం కలిగించే పంటలను పండించి ఆర్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వ్యవసాయం పండుగలా చేపట్టాలని కోరారు. ఆత్మవిశ్వాసంతో అధిక దిగుబడులు సాధిస్తూ స్థిరాదాయం పొందే ప్రతి ఒక్క రైతును ప్రోత్సహిస్తున్న ఆదర్శ రైతులకు, రైతాంగానికి రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. లక్షలోపు వ్యవసాయం సేద్యం ఉన్న ఈ ప్రాంతం నాలుగు లక్షల 40వేల ఎకరాలకు చేరుకున్నదంటే ఈ ప్రాంతం ఇంటిల్లిపాది కష్టించి పని చేయడమే కారణంగా పేర్కొన్నారు. రెండు లక్షల 20వేల ఎకరాలు ఓరి సాగు చేయబడుతుండగా ఒక లక్ష ఎకరాలు మిర్చి మరో 60 వేల ఎకరాలు పత్తి సాగు చేస్తున్నారని మిగిలిన ఎకరాలలో చేపడుతున్నట్లు తమ దృష్టిలో ఉందన్నారు. ఆదర్శ రైతు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగం కోసం పోరాడిన దివంగత స్వర్గీయ మాజీ ప్రధాని చరణ్ సింగ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 2001 నుంచి ఈ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం రైతులను సన్మానించారు. రైతుల కొరకు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను కలెక్టర్ తిలకించారు. అంతకుముందు రైతులు జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవి రెడ్డి, నరేంద్ర స్వరూప్, పద్మనాభరావు, కృష్ణారెడ్డి, జయశ్రీ, హరీష్, మోహన్, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ మాలతి వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీనారాయణ, ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖను హనుమకొండ లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రి సురేఖను కలిసిన జీటీఏ సంఘం ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా హనుమకొండకు విచ్చేసిన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి బుచ్చిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు వీరాచారి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుజ్జ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి అనిశెట్టి పరమేశ్వర్, సహాధ్యక్షులు వల్లపురెడ్డి నరేందర్ రెడ్డి, బిళ్ల కోటేశ్వర్, వెంకటేష్, కిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి విన్నవించారు. జీటీఏ సంఘానికి రికగ్నిషన్ కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

## జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు రామప్ప విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన రామప్ప జూనియర్ కళాశాల విద్యార్థులు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జీఎఫ్) అండర్ 19 స్టేట్ మీట్ అఫ్జల్ గంజ్ వీర అభిమన్యు వ్యాయామశాల హైదరాబాదులో జరిగాయి . జె.చిన్ని 53కేజీ విభాగంలో గోల్డ్ మెడల్, సీహెచ్ పృధ్వీక 59కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, బి.ప్రణవి 50కేజీల విభాగంలో బ్రోంజ్ మెడల్ పొందారు. గోల్డ్ మెడల్ సంపాదించిన జె.చిన్ని, సీహెచ్. పృధ్వీకలు ఈనెల 24 నుంచి 28 వరకు ఢిల్లీలో జరిగే నేషనల్ రెజ్లింగ్ ఈవెంట్ లో పాల్గొంటారని రామప్ప జూనియర్ కళాశాల డైరెక్టర్ ఐలీ కరుణాకర్ తెలిపారు. కళాశాల ఫిజికల్ కోచ్ కమల్, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

## క్రిస్మస్ గిఫ్ట్లను పంపిణీ చేసిన దాస్యం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మిషన్ హాస్పిటల్ లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా హాస్పటల్ లో గత 50సంవత్సరాల నుంచి పనిచేస్తున్న సిబ్బందికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి అనేక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ హాస్పటల్ నిర్వహించబడుతుందని, ఎన్ని ఒడిదడుకులొచ్చిన, సిబ్బంది ఎవరీకి ఎటువంటి ఇబ్బందులు కదగకుండా పనిచేస్తున్నారని అన్నారు. హాస్పటల్ లో ఉన్నపరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, హాస్పటల్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, కార్పొరేటర్ నర్సింగ్, ఉమ్మడి వరంగల్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు నయిముద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, నాయకులు పరుశురాం, సదానందం, విజయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్‌కు కూడా అందని వేతనాలు

### ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈనెల 23వ తేదీ గడుస్తున్నప్పటికీ వేతనాలు ఇంకా అందలేదు. దీంతో నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల ఉద్యోగులు దాదాపు 17వేల మందికి పైగా ఉన్నారు. వీరందరికీ ఇంతవరకు వేతనాలు జమ కాకపోవడంతో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ ఫీజులు, ఈఎంఐలు, ఇంటి అద్దెలతో పాటు, నిత్యావసర వస్తువులు, కొనుగోలు తదితర వాటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడు 23 వరకు వేతనాలు అందేవీ, కానీ ఈసారి మొట్టమొదటిసారిగా 23వ తేదీ వచ్చినప్పటికీ వేతనాలు జమ కాకపోవడంతో తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా క్రిస్మస్ పండుగ దగ్గరికి రావడంతో పండగకు డబ్బులు లేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ లో అర్బన్ హెల్త్ సెంటర్లో పీహెచ్ఎం, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్, అకౌంటెంట్స్, సపోర్టింగ్ స్టాఫ్ , ముగ్గురు మెడికల్ అసిస్టెంట్, ఎంఎన్ఓ, వాచ్‌మెన్, స్వీపర్, ఆయూష్ ఎస్ఎన్ఓ/ఎఫ్ఎన్ఓ ఎస్టీఎల్ఎస్ టీబీ లెప్రసీ వింగ్ ఆల్ సూపర్‌వైజర్స్, అనేక క్యాడర్ల సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న 17,000 మందికి వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆగ్రం పహాడ్ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు

## అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** ఆగ్రం పహాడ్ జాతర వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. శనివారం ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మినీ మేడారంగా పిలవబడే అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందుగా ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క సారమ్మ గద్దెలను దర్శించుకుని పూజలు నిర్వహించగా పూజారులు ఆయన్ని సత్కరించి సన్మానించారు. ఫిబ్రవరిలో జరిగే జాతరలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సౌకర్యాలు కల్పిస్తున్న తీరును శాఖల వారీగా అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గత జాతరలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తెలుసుకొని అవి తిరిగి పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ఏ పనులకు ఎంత మొత్తం నిధులు అవసరం ఉంటాయో డీటీఆర్ లు తయారు చేసి సంబంధితపై అధికారులకు పంపాలని అవసరమైన నిధులను సమకూర్చేందుకు కలెక్టర్ వద్దకు వెళ్లి మంజూరు చేయిస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడకూడదని నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేసి మంచి పేరు అధికారులు తెచ్చుకోవాలని కాంట్రాక్టు తీసుకున్న వారే పనులు పూర్తిచేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. సబ్ కాంట్రాక్టర్లు ఉంటే చర్యలు తీసుకుంటామని అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com